గిరిజన తండాలో దాహం కేకలు

యర్రగొండపాలెం: గిరిజన తండాల్లో తాగేందుకు నీరు లేక ప్రజలు అల్లాడి పోతున్నారు. తమ పనులు సైతం వదులుకొని సమీపంలోని పొలాల్లోకి వెళ్లి అక్కడ గంటల తరబడి నిలబడి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పుల్లలచెరువు మండలం కొమరోలు పంచాయతీలోని నరవ తండాలో గిరిజనులు నీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తండాలో దాదాపు 80 సుగాలి కుటుంబాలు ఉన్నాయి. వీరి అవసరాల కోసం గతంలో 4 డీప్‌వెల్ బోర్లు వేశారు. ట్యాంకు ఏర్పాటు చేసి తద్వారా నీరు సరఫరా చేసేవారు. తండాలో ఉన్న 4 బోర్లు పూర్తిగా అడుగంటాయి. రెండు బోర్లలో ఉన్న మోటార్లను సైతం తీసేశారు. నిరుపయోగంగా ఉన్న ట్యాంక్‌కు మరమ్మతులు చేయించి భూగర్భ జలాలు ఉన్న ప్రాంతంలో డీప్‌వెల్ బోరు వేసి నీటిని సరఫరా చేయకుండా అధికారులు ఆ ట్యాంక్ రోడ్డుకు అడ్డంగా ఉందని తొలగించారు. ఉన్న రెండు బోర్లు రోజుకు రెండు కుటుంబాలకు మాత్రమే నీటి అవసరాలు తీర్చుతున్నాయి. అయినా తండా ప్రజలు కుటుంబానికి రెండు బిందెలు నీరు పట్టుకొని కాలం గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎండలు తీవ్రతరం అవుతుండటంతో ఆ కాసిని నీరు కూడా రాకుండా పోతాయన్న ఆందోళనతో వారు ఉన్నారు. తండాలో ప్రతి కుటుంబం పశువులపై ఆధారపడి జీవిస్తోంది. అటువంటి పశువులకు తాపేందుకు నీటి కోసం అనునిత్యం దూర ప్రాంతాలకు తోలుకొని వెళ్లి అక్కడ మేతతోపాటు నీరు తాపించుకొని ఇళ్లు చేరుతున్నారు. మరుసటి రోజు వరకు పశువులు నీటి కోసం నాలుక చాపుకొని తమ వైపు బిత్తర చూపులు చూడటం తమకు కలచి వేస్తోందని ఆ గూడెం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో తండాలో గృహం నిర్మించుకునేందుకు నీటి కోసం బోరు వేయించుకొని తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. తమకు అనుకూలంగా ఉండే వారికి మాత్రమే ఆ బోరు యజమాని నీరు పట్టుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాడని వారు తెలిపారు. వెంటనే తండాలో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


నీటి కోసం ప్రైవేట్ బోరు చుట్టూ చేరిన తండా వాసులు

నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలి:



ట్యాంకర్లను ఏర్పాటు చేసి తండాలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలి. రోజుకు రెండు ట్యాంకర్ల ప్రకారం నీరు సరఫరా చేసి అందరికీ అందుబాటులో ఉండే విధంగా చర్య తీసుకోవాలి. తండాలో అరకొరగా వస్తున్న బోర్లకు మరమ్మతులు చేయించాలి. లేకుంటే భూగర్భ జలాలు మెండుగా ఉన్న ప్రాంతాలు తెలుసుకొని ఆయా ప్రాంతాల్లో రెండు డీప్‌వెల్ బోర్లు వేసి తండాకు నీరు సరఫరా చేయాలి. లేకుంటే నీటి కోసం తండా వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి.

– బాలునాయక్, తండా వాసి

క్లుప్తంగా

ఎస్టీఓను కలిసిన ఏపీఎన్జీఓ సంఘ నేతలు


ఎస్టీఓ మల్లేశ్వరిని అభినందిస్తున్న ఏపీ ఎన్జీఓ సంఘ నాయకులు

దర్శి (కురిచేడు): ఏపీ ఎన్జీఓల అసోసియేషన్ దర్శి తాలూకా యూనిట్ నాయకులు నూతనంగా విధుల్లో చేరిన ఎస్టీఓ మల్లేశ్వరిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. దర్శి తాలూకా యూనిట్ కార్యదర్శి బీజేఎస్ హెరాల్డ్, అసోసియేట్ ప్రెసిడెంట్ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ ఖయ్యూం, సంయుక్త కార్యదర్శి షేక్ గౌసియా, డీసీ మెంబర్ బీవీఎస్ నాగరాజు, ఆర్.జయరావులు ఎస్టీఓను కలిసిన వారిలో ఉన్నారు.

25 ఆటోలకు జరిమానా


ఆటోలకు జరిమానా విధిస్తున్న ఎంవీఐ రవికుమార్

దర్శి (కురిచేడు): రికార్డులు లేకుండా తిరుగుతున్న 25 ఆటోలకు రూ.20 వేల జరిమానా విధించినట్లు దర్శి మోటారు వాహనాల తనిఖీ అధికారి ఏటీ రవికుమార్ తెలిపారు. స్థానిక అద్దంకి రోడ్డులో పొదిలి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ ధనలక్ష్మి, సిబ్బందితో కలిసి శుక్రవారం అద్దంకి రోడ్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆ సమయంలో వచ్చిన ఆటోలను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేని వాటిని గుర్తించి జరిమానా విధించారు. జె.రామయ్య, మోటారు వాహనాల కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ దాతలకు ఘన సన్మానం


నాగరాజును సన్మానిస్తున్న బ్రహ్మారెడ్డి

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని మారెళ్ల పోలేరమ్మ దేవాలయ మండప నిర్మాణానికి సహకరించిన దాత కుంచాల పెద్దనాగరాజును ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆలయ మండపం నిర్మాణానికి కార్తికేయ కన్‌స్ట్రక్షన్ అధినేత కుంచాల పెద్ద నాగరాజు రూ.16 లక్షల విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్ సాధించిన భరత్ చంద్ర


భరత్ చంద్ర

యర్రగొండపాలెం: స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యశిస్తున్న పాటిబండ్ల భరత్ చంద్ర డిగ్రీ మొదటి సెమిస్టర్ యూనివర్సిటీ స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. బీఏ ఆనర్స్ విభాగంలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించి తమ కళాశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చిన భరత్ చంద్రకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ పి.ప్రదీప్, లెక్చరర్లు అభినందించారు.

శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

త్రిపురాంతకం: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ మండల కేంద్రం త్రిపురాంతకంలో బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఆర్యవైశ్య, కిరాణా మార్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు కేవీ రమణారెడ్డి, గురుస్వామి, పెద్దపూర్ణయ్య, సునీల్ కుమార్, శివప్రసాద్, మధు, బీజేపీ నాయకులు కె.పూర్ణనాగేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, మల్లికార్జున్, నరసయ్య, సురభి సుబ్రహ్మణ్యం, నరసింహారావు పాల్గొన్నారు.

సూర్య ఘర్ ఆఫర్‌ను వినియోగించుకోవాలి


విద్యుత్ సబ్సిడీ గురించి వివరిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

కురిచేడు: విద్యుత్ వినియోగదారులు సూర్య ఘర్ విద్యుత్ ఆఫర్‌ను వినియోగించుకోవాలని ఈఈ శ్రీనివాసరావు కోరారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం సిబ్బందితో ఆయన రివ్యూ సమావేశం నిర్వహించారు. సబ్‌స్టేషన్‌లోని అన్ని అంశాలను ఆయన సిబ్బందితో సమీక్షించారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ వినియోగదారులకు అవగాహన కలిగించాలన్నారు. కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేల సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ సంస్థ కొనుగోలు చేస్తుందన్నారు. ఏఈ రామకృష్ణ, లైన్ ఇన్‌స్పెక్టర్ బికారిషా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

దర్శి (కురిచేడు): కార్మిక చట్టాలను రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం తెచ్చిన 4 కోడ్ బిల్లులకు వ్యతిరేకంగా కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ పోరాడుతోందని జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశం షేక్ కాలేబాషా అధ్యక్షతన జరిగింది. సీపీఎం మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు సమావేశంలో తీర్మానం ప్రవేశ పెట్టగా కార్మికులందరూ పెహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన అమరులకు సంతాపం ప్రకటించారు. అనంతరం రంగారావు మాట్లాడుతూ స్కీం వర్కర్స్ అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, పంచాయతీ తదితర కార్మికులకు 2019 నుంచి వేతనాలు పెంచలేదన్నారు. నిత్యావసరాల ధరలు రెట్టింపయ్యాయన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛ భారత్ కార్మికులకు 2010లో ఇచ్చిన జీఓ అమలు చేయాలని, ఆటో కార్మికులపై పెనాల్టీలు, పోలీసుల వేధింపులు పెరిగాయని, చిన్నచిన్న తప్పిదాలకు కూడా దారుణమైన శిక్షలు విధిస్తూ తెచ్చిన మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోందని తెలిపారు. 2025 మేడే దినోత్సవం సీఐటీయూ ఆధ్వర్యంలో నియోజకవర్గం అంతా ఘనంగా నిర్వహిస్తూ కార్మిక సంఘాలు జెండా ఆవిష్కరణలు, ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని మేడే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలపై పోరాటం చేయాలని సీఐటీయూ నిర్ణయించిందని తెలిపారు. సమావేశంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ముఠా, బిల్డింగ్, ఎల్ఐసీ, పంచాయతీ, ఆటో, స్వచ్ఛ భారత్ తదితర రంగాల యూనియన్ నాయకులు ఆలూరి ఇశ్రాయేల్, ఇత్తడి కోటయ్య, యెహోషువా, చవలం గంగయ్య, మాధవిలత, లక్ష్మీదేవి, ఉప్పు నారాయణ, ఈమని నాగేశ్వరరావు, గోగు వెంకయ్య, గర్నెపూడి జాన్ శామ్యేల్, రత్నకుమారి, ఆదిలక్ష్మి, పోట్లూరి పుల్లయ్య, ఆవునోక్, చలమయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థినుల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వండి


ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి అర్జీ ఇచ్చి సమస్య వివరిస్తున్న యువకులు

● ఎమ్మెల్యే బూచేపల్లికి యువకుల వినతి

కురిచేడు: విద్యార్థినులకు రక్షణ ఉండే చోట హాస్టల్ నిర్మించాలని కొందరు యువకులు దర్శి శాసనసభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని కోరారు. యువకుల అభ్యర్థన మేరకు ఆయన శుక్రవారం ఉదయం కురిచేడు వచ్చారు. ఆయన్ను కలిసిన యువకులు స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలికల హాస్టల్ రూ.2 కోట్లతో నిర్మిస్తున్నారని, దానికి శంకుస్థాపన కూడా చేశారని తెలిపారు. పాఠశాల ఆవరణలో నిత్యం గ్రామస్తులు వాకింగ్ కోసం వస్తుంటారని, యువకులు ఆటలాడుకుంటుంటారని, పైగా పదో తరగతి విద్యార్థులు కూడా ఉంటారని చెప్పారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పక్కన లేక ఎన్ఎస్‌పీ కాలనీలో ప్రత్యేకంగా విద్యార్థినుల కోసం హాస్టల్ భవనం నిర్మిస్తే వారికి రక్షణ ఉంటుందని వారు ఎమ్మెల్యే బూచేపల్లికి విన్నవించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన ఆయన కలెక్టర్‌తో మాట్లాడి సమస్య లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, దొనకొండ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు ఆవుల లక్ష్మి వెంకటరెడ్డి, బుల్లం వెంకట నర్సయ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి నాగిరెడ్డి, నాయకులు ఎన్వీ నాగిరెడ్డి, గుంటక నాసరరెడ్డి, మహ్మద్ జానీ, కోల సంతోష్‌కుమార్, ముశికర యోగిరెడ్డి, అంకే కృష్ణ, షేక్ మౌలాలీ, రమేష్, రమణారెడ్డి, టి. సుబ్బారెడ్డి, జోసఫ్, రమేష్, జక్రయ్య పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


దొనకొండ: ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది


దర్శి: ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

పెద్దారవీడు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ జగదీష్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గ్రామంలోని వీధుల్లో మలేరియా అంతం.. మన పంతం, దోమకాటు ముప్పు, దోమ పుట్టరాదు.. దోమకుట్టరాదు.. అనే నినాదంతో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. ఇంటి ముందు మురుగు కాలువలో నీరు ఎప్పటికప్పు పారే విధంగా చూడాలన్నారు. ఇంటి ఆవరణంలో ఖాళీగా ఉన్న పాత టైర్లు, కొబ్బరి బొండాలు కాల్చి వేయాలన్నారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం ప్రతి కార్యకర్త నిర్వహించి ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రతి ఆశా కార్యకర్త రోజూ ప్రతి ఇంటిని సందర్శించి ఏవరికైనా జ్వరం వస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని చెప్పారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరినాథ్, హెల్త్ సూపర్‌వైజర్ సుభానీ పాల్గొన్నారు.


పెద్దారవీడు: ర్యాలీ చేస్తున్న డాక్టర్ జగదీష్, వైద్య సిబ్బంది

తాళ్లూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇళ్లల్లో ప్రజలు దోమతెరలు వాడితే మలేరియా, డెంగీ బారిన పడకుండా ఉండవచ్చని తూర్పు గంగవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం స్థానిక ప్రైమరీ హెల్త్ సెంటర్లో శుక్రవారం అధికారులు అవగాహన కల్పించారు. డాక్టర్లు మాట్లాడుతూ ఇళ్లల్లో ఆహార పదార్థాలపై మూతలు వేసి ఉంచాలని, రాత్రి వేళల్లో వేప ఆకులతో పొగ వేయాలన్నారు. డాక్టర్ శ్రీకాంత్‌తో పాటు హెచ్ఈఓ చంద్రశేఖర్, నర్సులు రమణమ్మ, సుశీల, ఏఎన్ఎం అనిత పాల్గొన్నారు.

దర్శి (కురిచేడు): ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.సుమన్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండి మలేరియా రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా చూడాలని, ఇంట్లో, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వాస్పత్రికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకొని చికిత్స చేయించుకోవాలన్నారు. నియోజకవర్గ మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.బసవారెడ్డి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, పాత్రలన్నింటినీ శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం 2030 నాటికి మలేరియాని పూర్తిగా నిర్మూలించడాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, సురక్షిత జీవితం కోసం ఆరోగ్యకర సమాజం ధ్యేయంగా పనిచేస్తానని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. హెడ్ నర్సు గౌసియా, ల్యాబ్ టెక్నీషియన్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి అన్వేష్, ఎస్‌యూఓ కృష్ణయ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రాథమిక వైద్యశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ర్యాలీ చేపట్టారు. గ్రామ ప్రజలకు మలేరియా వ్యాధి గురించి, వ్యాధి రకాలు, వ్యాధి లక్షణాలు, చలి, జ్వరం, తలనొప్పి, విరేచనాలు ఇబ్బందులు ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మలేరియా వ్యాధి దోమ అరికట్టాలంటే ఇంటి చుట్టూ నీటి నిల్వలు, నీటిలో లార్వాలు లేకుండా చూసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో దోమ తెరలు వాడాలని సిబ్బంది సూచించారు. అనంతరం సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. సీహెచ్ఓ ఇన్నాసమ్మ, ప్రభావతిదేవి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

దర్శి (కురిచేడు): చందలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో శుక్రవారం మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ సురేఖ మాట్లాడుతూ చలి, వణుకు, జ్వరంతో ఉన్న వారు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్ఓ దయమని, హెల్త్ సూపర్‌వైజరు ప్రసాద్, సబ్ యూనిట్ అధికారి బసవరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ వసంత్ కుమార్, సుభాషిణి, జ్యోతిబాయి పాల్గొన్నారు.

బెస్ట్ ఎంపీపీగా అవార్డు అందుకున్న పద్మజ


వీరభద్రాచారి నుంచి అవార్డు అందుకుంటున్న ఎంపీపీ గుమ్మా పద్మజ

● అభినందించిన వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: మండలానికి చెందిన గుమ్మా పద్మజ బెస్ట్ ఎంపీపీగా శుక్రవారం అవార్డు అందుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో ఉత్తమ ఎంపీపీలకు, సర్పంచ్‌లకు అవార్డులు అందజేశారు. జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పంచాయతీ సంఘం వ్యవస్థాపకులు, అధ్యక్షుడు వీరభద్రాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన గుమ్మా పద్మజకు అవార్డుతో పాటు ప్రశంసపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు మండలాలకు చెందిన ఎంపీపీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు. బెస్ట్ ఎంపీపీగా అవార్డు పొందిన గుమ్మా పద్మజను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, గుమ్మా యల్లేష్‌తో పాటు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

దొండపాడులో ధ్వజ స్తంభం ప్రతిష్ట


ధ్వజ స్తంభం ప్రతిష్ట


విగ్రహాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లి పంచాయతీ పరిధి దొండపాడులో శ్రీరామచంద్ర విగ్రహ, జీవ ధ్వజ స్తంభం ప్రతిష్టను శుక్రవారం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. రెండు రోజుల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పురోహితులు రామకృష్ణ శాస్త్రి, శివ కుమార్ శాస్త్రి, నాగరాజుశర్మ ప్రత్యేక పూజలు చేసి ధ్వజ స్తంభం, శిఖర, కలశ, నూతన విగ్రహాల ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలు జరిపారు. జీవ ధ్వజ స్తంభాన్ని భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు ప్రతిష్ఠించారు. ప్రతిష్ట కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. చుట్టుపక్కల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, కర్నాటి ఆంజనేయరెడ్డి, బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, తమ్మనేని సుబ్బారెడ్డి, బాపనపల్లి శ్రీను, కన్నెధార వెంకట సుబ్బయ్య, వీరపనేని చెన్నయ్య పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో లాభాలు ఎన్నో

పెద్దారవీడు: భూసార పరీక్షలు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. మండలంలోని గొబ్బూరు రైతు సేవా కేంద్రంలో రైతులకు మట్టి నమూనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు చేస్తే అవసరమైన ఎరువులు మాత్రమే వాడవచ్చని, ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవాలంటూ దాని ఉపయోగాల గురించి వివరించారు. పచ్చిరొట్ట సాగు అనంతరం సాగుకు ముందు దాన్ని అక్కడే దున్నుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు అధికంగా వాడితే భూసారం దెబ్బతింటుందని, పంట దిగుబడి తగ్గి నష్టాలు చవిచూడాల్సి వస్తుందన్నారు. అధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. 2024–25 రబీ సీజన్ కరువు జాబితాను రైతు సేవా కేంద్రంలో ప్రదర్శించారు.


గొబ్బూరులో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

తాళ్లూరులో పూడికతీత పనులు


పూడిక తీయిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

తాళ్లూరు: మండల కేంద్రం తాళ్లూరు ఎస్సీ కాలనీ వద్ద వెల్లంపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు వెంబడి ఉన్న కాలువల్లో చాలా రోజులుగా పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను జేసీబీ సాయంతో శుక్రవారం తొలగించినట్లు సర్పంచ్ చార్లెస్ సర్జన్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పూడికతీత పనులు చేపట్టినందున నిల్వ ఉన్న మురుగు నీరు కాలువ నుంచి వెళ్లడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. పూడికతీత అనంతరం కాలనీలో బ్లీచింగ్ చల్లించినట్లు పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి తెలిపారు. వీరి పని తీరుపై స్థానికులు హర్ష వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయ సిబ్బంది రామారావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

47 మందికి నేత్ర పరీక్షలు


నేత్ర పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ అధికారి హెరాల్డ్

కురిచేడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ సూచన మేరకు మండలంలోని పొట్లపాడులో 47 మందికి శుక్రవారం నేత్ర పరీక్షలు నిర్వహించినట్లు ఆప్తాల్మిక్ అధికారి బీజేఎస్ హెరాల్డ్ తెలిపారు. వారిలో 13 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించామన్నారు. మిగిలిన వారికి మందులు ఇచ్చారు. కంటిచూపు మెరుగు పరచుకోవటం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్ల గురించి వివరించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొబ్బరి తోటల ఫలసాయానికి వేలం

దర్శి (కురిచేడు): మండలంలోని ఉద్యాన నర్సరీలో ఉన్న మామిడి, కొబ్బరి చెట్ల ఫలసాయానికి శనివారం ఉదయం వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన శాఖాధికారి రవి వెంకన్నబాబు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా 10 వేల రూపాయల ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వేలం నెగ్గని వారి ధరావత్తు సొమ్మును వేలంపాట ముగిసిన వెంటనే తిరిగి చెల్లిస్తామన్నారు. వేలంలో నెగ్గిన వారి ధరావత్తు సొమ్మును ఫలసాయం కోత పూర్తి అయిన తర్వాత పాటదారునికి చెల్లిస్తామన్నారు. పాటదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు


రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రసాద్‌రావు

తాళ్లూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తున్నామని, రైతులు వీటిని కొనుగోలు చేసి పొలంలో చల్లుకొని నేలలను సారవంతం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు కోరారు. మండలంలోని శివరాంపురం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం పచ్చిరొట్ట విత్తనాలకు సంబంధించిన వివరాలు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 10 కేజీల జనుములు ధర రూ.1090 రాయితీపై రూ.545, 10 కేజీల జీలుగులు ధర రూ.1230కాగా రాయితీపై రూ.615, 10 కేజీల పిల్లిపిసర పూర్తి ధర రూ.1800కాగా రాయితీపై రూ.900 ఇవ్వనున్నట్లు తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకొని పచ్చిరొట్ట విత్తనాలు పొందాలన్నారు.